క్లుప్తంగా

సొసైటీకి చేరిన ఎరువులు



రసాయనిక ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ

ఉయ్యాలవాడ: పెద్దయమ్మనూరు సహకార పరపతి సంఘానికి 24 టన్నులు రసాయనిక ఎరువులు చేరుకున్నాయి. గురువారం ఎరువుల నిల్వలను మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ పరిశీలించి మాట్లాడారు. 20–20–0 12 టన్నులు రాగా ఒక బస్తా ధర రూ. 1100లు చొప్పున, అలాగే డీఏపీ 12 టన్నులు రాగా ఒక బస్తా రూ. 1350లకు రైతులకు అందజేయనున్నట్లు ఏఓ స్పష్టం చేశారు. మండల పరిధిలోని ఉయ్యాలవాడ, హరివరం, బోడెమ్మనూరు సహకార పరపతి సంఘాలకు కూడా వారికి కావాల్సిన ఇండెంట్ అందజేస్తే ఉన్నతాధికారులు కేటాయిస్తారన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): జిల్లాలో ప్రైవేటు డీలర్ల వద్ద 560 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద వంద మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, హోల్‌సేల్, రిటైల్ దుకాణ యజమానులు ఎరువుల కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని ఏడీఏ రాజశేఖర్ హెచ్చరించారు. స్థానిక సంజీవరెడ్డి ఏజెన్సీస్, మారుతి ట్రేడింగ్ కంపెనీ, సుధీ రాఘవేంద్ర ఏజెన్సీస్ దుకాణాల్లో గురువారం వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల రిజిస్టర్లు, బిల్ బుక్స్ తదితరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్‌లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, ఎమ్మార్పీ కంటే ఎరువులు అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ ప్రసాదరావు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ప్రసాద్‌లు మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టర్లను అడుగుతున్నా వాయిదాలు వేస్తున్నారని అన్నారు. వేతనాలు వెంటనే ఇవ్వకపోతే సోమవారం నుంచి విధులను బహిష్కరించి ఆందోళన చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, మహేష్, రమణమ్మ, శ్యామల, సునిత, సరస్వతి, పుల్లయ్య, కిరణ్, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నంద్యాల(అర్బన్): మండల నిలిచిన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేందుకు లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలంలో దాదాపు 255 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి వచ్చిందని, వాటికి సంబంధించి బడ్జెట్ విడుదల అయ్యిందని, నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజారఘువర్మ, ఈఓఆర్‌డీ రామాంజనేయులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీ వార్షికోత్సవం



గోవిందపల్లెలో బైక్ ర్యాలీ చేస్తున్న కార్యకర్తలు

శిరివెళ్ల: వీహెచ్‌పీ 60వ వార్షికోత్సవాన్ని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బైక్ ర్యాలీ చేస్తూ గోవిందపల్లెకు చేరుకున్నారు. అక్కడ పురవీధుల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు చంద్రమౌళీశ్వరరెడ్డి, వైపీ రామయ్య మాట్లాడుతూ హిందూ మత అభివృద్ధికి, ఆలయాల అభివృద్ధికి తాము ఎంతో పాటు పడ్డామన్నారు. శ్రీరామనామ జపంతో తమ కార్యకర్తలు బైక్ ర్యాలీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అఖండ అధ్యక్షుడు నడిపి సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాహిత్య సౌరభాల భాష తెలుగు

నంద్యాల(న్యూటౌన్): సాహిత్య సౌరభాలతో విరాజిల్లే తెలుగు పసిడి వెన్నెల భాష అని మాతృభాష పరిరక్షణ సమితి గౌరవ సలహాదారులు, విశ్రాంత శాస్త్రవేత్త ఖాదరబాద్ రవీంద్రనాథ్ అన్నారు. గురువారం మాతృభాష పరిరక్షణ సమితి కార్యాలయంలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా 'మాతృభాషకు వందనం' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్నయసూరి సాహితీ సమితి అధ్యక్షుడు రమణమూర్తి, సాహితీ వేత్తలు శ్రీనివాసరెడ్డి, శేషఫణి, నీలకంఠమాచారి, మహబూబ్‌బాషా, ప్రసాద్, నంది రైతు సమాఖ్య నాయకులు కైలాసనాథరెడ్డి, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొని ప్రపంచ వ్యాప్తంగా అఖండ ఖ్యాతి పొందిన తెలుగు భాష మాధుర్యాన్ని నేటి తరం విద్యార్థులు గుర్తించాలని కోరారు. అనంతరం గిడుగు రామ్మూర్తి, తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే నంద్యాల శారదా విద్యాపీఠంలో పాఠశాలలో విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మాతృభాష పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటకృష్ణయ్య, శేషఫణి, కేశవమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన సాహితీ స్రవంతి సభ్యులు



గిడుగు రామ్మూర్తి మనవరాలు కాంతి కృష్ణ నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రసాద్

కొప్పుల ప్రసాద్‌కు గిడుగు సాహితీ పురస్కారం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన కవి కొప్పుల ప్రసాద్ గిడుగు సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ నవ్యాంధ్ర రచయితల సంఘం, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసేందుకు ఈ పురస్కారం అందజేయడం జరిగిందన్నారు. గిడుగు రామ్మూర్తి ముని మనవరాలు కాంతి కృష్ణ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కొప్పుల ప్రసాద్‌ను పట్టణ కవులు, సాహితీ వేత్తలు, భాషాభిమానులు అభినందించారు. కార్యక్రమంలో కళారత్న బిక్కి కృష్ణ, విమలా సాహితీ సమితి అధ్యక్షురాలు డాక్టర్ జల్ది విద్యాధర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

- పట్టణంలో శ్రీపింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో సాహితీ స్రవంతి సభ్యుల ఆధ్వర్యంలో గిడుగు వెంకటరామ్మూర్తి తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు పద్య పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

గోస్పాడులో..



గోస్పాడులో వ్యాయామ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: ఘనంగా జాతీయ తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని, భారతదేశ హాకీ క్రీడాకారుడు ధాన్యచంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోస్పాడులోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు సాల్మన్, గీతావాణిలను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. విద్యార్థులను క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్, హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమృతం కన్నా కమ్మనైనది

ఆళ్లగడ్డ: అమ్మభాష అమృతం కంటే కమ్మనైనది.. ఎన్ని భాషలున్నా తేట తెలుగుకు సరిరావు.. అటువంటి మాతృభాషను ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల విద్యాశాఖాధికారిణి శోభావివేకవతి అన్నారు. తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగుభాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: తెలుగుభాష గొప్పతనం విద్యార్థి దశ నుంచే చాటి చెప్పాలని, మాతృభాషను ఎప్పటికీ మరవరాదని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి, క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రుద్రవరంలో..

రుద్రవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయ బృందం కలిసి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి శాలువ, పూల మాలతో సత్కరించారు. కేజీబీవీ పాఠశాలలో ఎస్‌ఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏపీ మోడల్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావుకు సూచించారు.

శిరివెళ్లలో..

శిరివెళ్ల: జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను మండలంలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు శ్రీనివాసులు, పీడీ విజయకుమార్‌ను సన్మానించారు. తెలుగు భాషా ప్రాముఖ్యత, క్రీడల ఆవశ్యకతను హెచ్‌ఎం విజయకుమార్ విద్యార్థులకు వివరించారు. విమలా పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కోటయ్య ఆధ్వర్యంలో ప్రముఖ హాకీ క్రీడాకారుడు దివంగత ధ్యాన్ చంద్, తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పార్థసారథి, ఎస్ఎంసీ చైర్మన్ గౌస్‌మోహిద్దీన్, పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులు శాస్త్రి, మహబూబ్‌బాషా, శివశంకర్, రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడ లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకబృందం



ఆళ్లగడ్డలో ఆకట్టుకున్న చిన్నారుల విన్యాసాలు

మాతా, శిశు మరణాలు జీరో స్థాయికి తీసుకురావాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): మాతా, శిశు మరణాలు జీరో స్థాయికి చేరుకునేలా వైద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫరుల్లా, జీజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీజ, డీఐఓ డాక్టర్ ప్రసన్న, ఐసీడీఎస్ పీడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ప్రతి గర్భిణీపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరాయంగా వైద్య సేవలు అందించడంతో పాటు పోషక పదార్థాలు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో గత మూడు నెలల కాలంలో నాలుగు మాతృ మరణాలు, మూడు శిశు మరణాలు జరగడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు పునరావృత్తమైతే సంబంధిత అధికారులను ఉపేక్షించకుండా సర్వీస్ నుండి తొలగించేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో గర్భిణులకు సరైన పోషక పదార్థాలు పంపిణీ చేయడం, కౌన్సెలింగ్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన సీడీపీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలను సస్పెండ్ చేసేలా నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

సీసీఆర్ కార్డుల జారీపై దృష్టి సారించండి

- జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



ముత్యాలపాడు గ్రామ వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

చాగలమర్రి: కౌలు రైతులను గుర్తించి సీసీఆర్ కార్డులను జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ విష్ణుచరణ్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఈ–పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఎంత మంది కౌలు రైతులను గుర్తించారు? వారిలో ఎంత మందికి కౌలు కార్డులు మంజూరు చేశారని సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలో 837 మందిని గుర్తించి 32 శాతం మందికి కౌలు కార్డులు మంజూరు చేశామని సిబ్బంది. మిగతా కౌలు రైతులకు సొంత భూ యజమానులు కౌలు అగ్రిమెంట్లు ఇవ్వడం లేదన్నారు. అందుకు జేసీ స్పందిస్తూ గ్రామాల్లో ఈ విషయంపై రైతుల్లో అవగాహన కల్పించి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. మండలంలో భూ రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో ఉన్న భూములకు సంబంధించి కొన్ని సర్వే నెంబర్ల డేటా ఆన్‌లైన్‌లో అక్టివేట్ కావడం లేదని వీహెచ్‌ఏ ఉషారాణి తెలిపారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. తమ భూములకు పట్టాలున్నా ఆన్‌లైన్ చేయడం లేదని తహసీల్దారు, పెద్ద బోధనం వీఆర్‌ఓలు పట్టించుకోవడం లేదని చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన యామ నర్సిరెడ్డి, పరమేశ్వరరెడ్డి అనే రైతులు జేసీకి ఫిర్యాదు చేశారు. ముత్యాలపాడు గ్రామంలో కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేస్తున్న రైతు నాగేశ్వరరావును జేసీ అభినందించారు. ఆయన వెంట జేడీఏ మోహన్‌రావు, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్ కుమార్‌రెడ్డి, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే నెల 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధికారి ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్, అమేజాన్, గ్రామీణ్, ట్రాస్కెన్, అపోలా, ఫోన్‌పే తదితర కంపెనీల్లో పని చేసేందుకు ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది, ఐటీఐ, డిప్లొమో, బీఫార్మసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9440224291ను సంప్రదించాలన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఆలయాల హుండీ లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, మల్లికార్జునస్వామి దేవస్థానం, చిత్తలూరి వీధిలో శ్రీకృష్ణ భజన మందిరం ఆలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం తనిఖీ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.2,00,717 ఆదాయం లభించిందని, గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.23,447 ఆదాయం పెరిగిందన్నారు. మల్లికార్జునస్వామి దేవస్థానంలో రూ.71,099 రాగా గత ఏడాది కంటే రూ.19,974 ఆదాయం పెరిగిందన్నారు. శ్రీకృష్ణ భజన మందిరం హుండీ ఆదాయం రూ.16,317 రాగా గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.5,172 ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఆలయాల ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు ప్రహ్లాద వరదాచారి, సుబ్బయ్యశర్మ, సుధీంద్రాచార్యులు, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి 3కేరన్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి తదితరులు



ధ్యాన్ చంద్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ శశికళా తదితరులు

3కే రన్ విజయవంతం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ క్రీడా హాకీ మాంత్రికుడు ధాన్యచంద్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఉదయం క్రీడా భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే రన్ విజయవంతమైంది. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి హాజరై జెండా ఊపి 3కేరన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాభారతి జనరల్ సెక్రటరీ, అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ నంద్యాల క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో క్రీడా భారతి నిర్వాహకులు హేమంత్‌రెడ్డి, మహేశ్వరి, రమేష్, రమణ, ప్రదీప్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గురురాజ పాఠశాలలో..

నంద్యాల పట్టణంలోని గురురాజ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డిలు మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలైన వారికి సన్మానించారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణ డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గురురాజ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఒలంపిక్స్‌లో క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారన్నారు. అనంతరం వివిధ రకాల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయలక్ష్మి, నాగేంద్ర, దస్తగిరి, రామలింగారెడ్డి, కుసుమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

ఉయ్యాలవాడ: మండలంలో శనివారం నుండి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో 3,887 మంది పింఛన్‌దారులకు రూ. 1,61,55000లు నగదు మంజూరయిందన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రంలోని సంక్షేమ వసతి గృహాలను తహసీల్దార్, ఎంపీడీఓలు తనిఖీలు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, హాస్టళ్లలో సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. దేవనగర్‌లోని బీసీ హాస్టల్‌ను ప్రైవేటు భవనంలో నడుపుతుండటం, ప్రభుత్వ భవనం కూలేందుకు సిద్ధంగా ఉండటాన్ని ఎంపీడీఓ సుగుణశ్రీ పరిశీలించారు. ఎస్టీ బాలికల జూనియర్ కళాశాల హాస్టల్‌లో పరిసరాలు శుభ్రంగా లేవంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు గదులు చిన్నపాటి వర్షానికే కారుతున్నాయంటూ విద్యార్థులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ ప్రియదర్శిని, జూనియర్ కళాశాల హాస్టల్, ఎస్సీ హాస్టళ్లలోని వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. పరిశీలించిన నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు చెప్పారు. వీరి వెంట డీటీ రామసంజీవరావు, ఏఈ శంకర్, ఆర్ఐ యుగంధర్‌రెడ్డి, ఈఓఆర్‌డీ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

హామీలను చిత్తశుద్ధితో అమలు చేయండి



మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఎమ్మెల్యే అఖిలప్రియ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అఖిలప్రియ మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెంచేందుకు అడ్డుగా ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే ప్రదేశానికి తరలించే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఆసుపత్రి సమీపంలో ఉన్న ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రూ. 25 లక్షల నిధులు విడుదల చేయించి అక్కడ నుంచి వేరేచోటుకు తరలించామన్నారు. రెండు విడతల్లో రూ. 9 కోట్లు నిధులు మంజూరు చేయించి ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయనే విషయం అఖిలప్రియ తెలుసుకోవాలన్నారు. చిన్న చిన్న రియల్టర్లు వ్యాపారాలు చేసుకోకుండా వారు కొనుగోలు చేసిన భూములను రిజిస్టర్ చేయకూడదని సబ్ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి చేసి పేపర్లలో ప్రకటనలు ఇప్పించడం న్యాయమా అని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో కొత్త బస్టాండ్ ఎవరు కట్టించారో ప్రజలకు తెలుసునన్నారు. అహోబిలంలో సుమారు రూ. 40 లక్షలకు పాడాల్సిన టోల్‌గేట్ వేలంపాట రూ. 19 లక్షలకే పాడితే, మిగతా రూ. 20 లక్షలు ఎక్కడికి పోయాయని నిలదీశారు. సూపర్ సిక్స్ ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీ నేతలపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నేతలపై అనవసరపు ఆరోపణలు చేస్తే చూస్తే ఊరుకోమన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ

నంద్యాల(వ్యవసాయం): పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి ఎస్.లక్ష్మి అన్నారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జడ్జిని సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు శాలువా, బొకేలు ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. మొదటిసారిగా న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జడ్జిని న్యాయమూర్తులు, న్యాయవాదులు అభినందించారు. కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దుర్గాప్రసాద్, భూపని వెంకటేశ్వర్లు, బాబు, తదితర సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మి